# వెన్నెల్లో సాలెగూడు

బి.ఏ. పరీక్షకు వెళ్ళబోతున్నాననినాకైనా సరిగా తెలిసిందో లేదో... పెళ్ళి సంబంధాలు జట్లు జట్లుగా రావడం మొదలెట్టాయి నామీదకి; మొదటి పరీక్ష రాసిన రోజున నాన్న దగ్గిర్నించి వుత్తరం వచ్చింది; ఆఖరు పరీక్ష అయిన మరుక్షణంలో బయలుదేరి ఇక్కడకు రావలెను. పెట్టె వగైరాలు తర్వాత తెచ్చుకున్నను ఫరవాలేదు...

ఉత్తరం ధోరణి చూస్తేనే తెలిసిపోతోంది దాని వెనకాల ఏదో కుట్ర వుందని.

"అమ్ముడు పోయే వెధవ ... కోరిన ధర ఇచ్చేటప్పుడు కొనేదెవరైతేనేం?"- ఇదీ నాన్న ఉద్దేశం.

అందుచేతనే మావాళ్ళంతా నన్ను రైలు దిగగానే ముట్టడించి, రెక్కలు విరిచికట్టి ఇంటికి ఈడ్చుకెళ్ళడం అసాధ్యమని తోస్తే ఏ 'పోలీసు గొడుగు' నీడనో ఓ పెట్టె పుట్టిన బ్రహ్మరాక్షసికి కట్టేయడం అసంభవం కాదనే నిర్ణయానికి నేను రావాల్సి వచ్చింది. తత్ఫలితంగా పరీక్షలై ఇరవై రోజులయినా ఇంటికెళ్ళే ప్రయత్నం గురించైనా ఆలోచించలేదు.

ఈ లోగా నాన్నా నేనూ కార్డుల మీద కత్తులు దూశాం. నాన్న మూర్ఖపు పట్టు చూసి మొండికెత్తాను నేను. నా మొండితనం చూసి మండిపోయాడు నాన్న.

ఆ ఇరవై రోజులూ వాస్తవానికీ ఆదర్శానికీ మధ్య ఊగులాడుతూ గడిపాను. వాస్తవం వడగళ్ళు కురిపిస్తుంటే పచ్చని సాహిత్యస్వప్నాల గుబురుల్లో తల దాచుకుందామనుకున్నాను. తల పగలడం తప్పింది కాని, చిరుచెమటలా చినుకులు ఒంటిమీద కనబడుతూనే వున్నాయి.

ఇరవై రోజులూ అలా గడిపి ఇరవై ఒకటోనాడు అలా గోదావరి గాలిలోనైనా గుండెను చల్లార్చుకోవచ్చనే ఆశతో బయలుదేరాను.

చూడాలి కదా అని అద్దంలోకి చూశాను.

"నువ్వు బి.ఏ పరీక్షకెళ్ళిన వాడిలా ... కనీసం పాడుచేసిన వాడి లాగా నైనా లేవు." చూడగానే చెప్పింది అద్దం.

"ఎలా లేనో ఎందుకు! నాక్కావలసింది నేనెలా ఉన్నదీను."

"నీచేతిలో ఆ 'హామ్లెట్' నువ్వు చదివేదీ అనిపించకపోతే, ఇన్నాళ్ళనించీ నిన్ను చూస్తున్న నేను కూడా "ఆః. ఎవరో! ఆవారాలే!" అంటే తేలిగ్గా నమ్మేదాన్ని. నాకంటే

సులువుగా దగా తినేవాళ్ళుండరని నీకూ తెలుసు."

అద్దం అలా దేవుళ్లాడ్డం చూస్తే నాకు పరమ సంతోషమైంది.

చేతులు సరిగా మడవని షర్టు, మాసిన పైజమా, నెలక్రితం కట్లు తెంచుకున్న జుట్టు, నాదవునా కాదా అనిపించే నాముఖం, పీక్కుపోయిన కళ్ళూ ... అదీ నారూపం. "మామజాగా వుందే అవతారం! అనుకున్నాను.

విడిచి వెళ్ళిపోయేదేకదా అనే కాబోలు మాకాలేజీ మీద అపూర్వమైన భక్తి భావం కలిగింది. ఆ కాలేజీ చరిత్రను నెమరువేస్తూ ఎంతసేపు కూర్చున్నానో ఆ గచ్చుమీద-. తలెత్తే సరికి గోదావరి గాలి తియ్యగా గుసగుసలాడుతోంది నా చెంపమీద ముఖాన్నాన్చి. గోదావరి అవతలి గట్టు ఎర్రశాలువా చుట్టుకుంది. గాలి ఆసరాతో ఉషారుగా పోతోంది పడవ.

అలా చూస్తూ తిరిగి మైకంలో పడ్డాను. ఆ మహోవాహిని మహిమ ఏమిటో కాని నన్ను ఇన్నాళ్ళు వేధించే పీడకలలూ, గుండెమంటా తాత్కాలికంగా కన్ను మూశాయి.

చప్పట్లు వినపడ్డాయి దగ్గరగా. "ఎంత పిలిచినా వినపడదేం! అంత తన్మయత్వం ఏవిటండీ."

ఉలిక్కిపడ్డాను. ఈ ఊళ్ళో నాతో మాట్లాడే ఆడవాళ్ళెవరూ! గాజుల గలగల లాంటి ఆమె నవ్వు విని తల ఎత్తాను. ఇంకా నవ్వుతోంది.

"ఓహో ... మీ...రా!" అన్నాను, గొంతుకని బలవంతంగా ఉషారుచేసి. ఆమె ఇంకా గుర్తుకు రావడం లేదు. 'కాలేజీ అమ్మాయి కాకపోదులే' అని ధైర్యం చెప్పుకున్నాను. ఒడ్డునపడ్డ చేపలా కొట్టుకుంటోంది మనస్సు.

ఆమె మళ్ళీ నవ్వింది. ఈమారు నవ్వులో కొద్దిగా వ్యంగ్యం కనపడినట్టైంది.

"మీ పేరు రాజు కదూ?" ఆమే మాట్లాడింది మొదట.

"అవును"

"నాపేరు - వసుంధర .... కదూ!"

"అవు ....ను" అతికష్టంమీద అన్నాను. ఆమె కిలారున నవ్వింది.

నేను మందతప్పిన గొర్రెలా ముఖం పెట్టాను.

"ఫరవాలేదు లెండి; మరిచిపోవడం, పోకపోవడం మనచేతిలో లేవుగా!" ఊరడించాలని ప్రయత్నిస్తోంది.

"మిమ్మల్ని మరిచిపోవడం - మరిచిపోవడం కాదుగాని - ఈవేళ ఎంచేతనో ...'

"ఈవేళ మీరు మీలా లేరంటారు"

"సరిగ్గా అంతే కాదనుకోండి. హెూరుగాలి .... ఇరవై రోజులక్రితం ఎగిరిపోయిన గడ్డి పరకల్ని ఓ క్షణంలో పోగుచేయడం చాలా కష్టం." రెండోవాక్యం నాలో నేను అనుకున్నాననుకుంటూ అన్నాను.

అని తలపైకెత్తేసరికి ఎంత సేపట్నుంచి చూస్తోందో ఏమో - ఆమె నన్ను చూపులతో తూస్తోంది. నేను ఆమెవేపు చూడగానే ఆమె గోదావరిలోకి చూడ్డం మొదలుపెట్టింది. ఎందుకో

నన్ను నేను చూసుకున్నాను.

నేను పరమ అసహ్యంగా ఉన్నానని తోచింది.

"రండి అలా ఆ ఇసకలో కూర్చుందాం" వసుంధర దారితీసింది.

వసుంధర ఎలా ఎవరిలా వుంటుంది. అంటే జవాబు దొరకదు. వసుంధర వసుంధర లాగే వుంటుంది. అందంగానే వుందనిపించింది నాకు.

వసుంధర ముక్కు సంపెంగపువ్వులా ఉండదు. కళ్ళు కలువరేకులలాగా ఉండవు. పెదవికీ దొండపండుకి పోలికలేదు .... భాషలో అందం పదాల కూర్పుమీద ఆధారపడి వుంటుంది - కాని విడివిడిగా ప్రతిమాట అందంగా ఉండాలని లేదు.

వసుంధర ముఖాకర్షణ ఆమె మాట్లేడే తీరు .... ఆమె మాట్లాడితే సంగీతం వినిపిస్తుం దని ... ప్లేబాక్ పాడేవాళ్ళు మాట్లాడుతుంటే శ్రద్ధగా వినబుద్దేస్తుందనే నమ్మకం లేదు నాకు.

ఆమెతో నాకు కొద్దిగా పరిచయం వుంది. ఓమారు కాలేజీ మేగజైన్‌లో పడ్డ నా కధకి ఫస్ట్‌ప్రైజ్ వస్తే కంగ్రాచ్యులేట్ చేస్తానంటూ తయారైంది. నాకు ఆ రోజులలో ఆడపిల్ల లతో మాటలాడ్డమంటే చాలా సిగ్గుగా ఉండేది. అలాంటి నన్నే అప్పుడు పావుగంట వాగించింది వసుంధర.

* * *

"ఇంకెక్కడికి నడుస్తారు? నీళ్ళలోకా" కాళ్ళూ, పాదాలు అప్పటికే తడిశాయి, నది నీళ్ళలో. వెనక్కి చూశాను. రమ్మన్నట్టు తల ఆడించింది, ఇసుకలో కూర్చొని ....

'అంత పరధ్యానంలో పడ్డారేమిటి."

జవాబు కోసం తడుముకున్నాను.

'దానికేం గాని పేపర్లన్నీ బాగా రాశారా?"

"ఏదో రాశాన్లెండి."

"మీది ఈ ఊరేనా?"

"కాదు"

"ఇంకా ఎందుకు ఇక్కడున్నారు?" అని అడుగుతుందేమోనని భయపడ్డాను.

"ఇంకా ఎన్నాళ్ళుంటారిక్కడ?" ఎంత చక్కగా అడిగిందో?

"చెప్పలేను. ఇక్కడే వుండిపోవచ్చు."

"చిన్నపిల్లలకి ప్రయివేట్లు చెప్తూ-నా?" నవ్వింది.

అందులో హేళనలేదు. "ఇంకొంచెం బాగా బతకొచ్చుకదా" అనే ఆశాదీపం మాత్రం ఉంది. నేనేం జవాబు చెప్పలేదు.

"పోన్లెండి. ఉన్ననాలుగు రోజుల్లోనూ అప్పుడప్పుడు పలకరించుకోవచ్చు."

నా ముఖం మతాబులా వెలిగిపోతోందేమో ... వసుంధర నవ్వింది.

"ఏమైనా తప్పు మాటన్నానా?"

"ఎంతమాత్రం లేదు."

నవ్వాను. నవ్వి ఎన్నాళ్ళైందో.

వసుంధర అవీ ఇవీ ఏమేమిటో చెప్పుకుపోతోంది. నేను ఊఁ కొడుతున్నాను .... రాత్రి రెక్కలు విప్పుతోంది లోకాన్ని కప్పడానికి. "ఏమిటంతలా ఆలోచిస్తున్నారు! గోదారొడ్డుకి షికారొచ్చి పొద్దుపోయేదాకా ఎప్పుడూ కూర్చోలేదు గావును!?"

ఇంటికి పోదామని లేచాం.

నేను నడుస్తూ ఆలోచిస్తున్నాను. వసుంధర నన్నెంతో తెలిసున్నట్టు మాట్లాడింది. స్నేహం అభిలషిస్తున్నట్టు మాట్లాడింది. చంద్రుడే వచ్చి "నీ ఇంట్లోనే వుంటా"నని తిష్ఠ వేస్తే సంతోషించని వాళ్ళుండరు కదా.

"మీకు ఈ దారులన్నీ కంఠతా వచ్చల్లే వుందే! తలవంచుకునే సందులన్నీ నడిచేశారు!"

"ఇలాగే కాలేజీకి వెళ్ళడం ... రావడం కదూ."

"ఇదే మా ఇల్లు". అన్నది వసుంధర.

ఇదే? ... కాని కాలేజీకి వెళ్తున్నప్పుడు వసుంధర కనబడే అవకాశం లేదు. ఎందుకంటే నేను తొమ్మిదిగంటలకే హొటల్‌కి వెళ్ళి అటువైపు నించే కాలేజీకి వెళ్ళేవాడిని. (ఆ పక్కసందులోనే మాలాడ్జి, మురుక్కాలవా మొదలైన సర్వహంగులతోటీ దర్శనమిస్తుంది.)

"ఆ ఆంబోతు పడుకుంది చూశారూ, పేవుమెంట్ మీద. ఆమెట్లమీంచే మా రూంలోకి వెళ్ళాలి."

"దగ్గర్లోనే వున్నాంగా .... తరుచు కలుసుకుంటూ ఉండచ్చు. గుడ్‌నైట్" తలుపు తెరిచినప్పుడు పడిన బల్బు కాంతిలో చురుక్కున మెరిసి మాయమైంది వసుంధర. తలుపు మూసుకుంది.

ఆమేడ వసుంధర అమ్మమ్మగారిదిట. చిన్నప్పుడే వసుంధర తల్లీ తండ్రీ; ఆ తరవాత అమ్మమ్మా పోతే తాతగారి వద్దనే పెరిగిందట మాటల్లో తెలిసింది. వసుంధర ఇంటర్మీడియట్ పరీక్షకు వెళ్ళినట్టు. ఎందుకోగాని, ఆ రాత్రి భోజనం చేసొచ్చేసరికి లాడ్జి ముందున్న ఆంబో తుని చూడగానే దాన్ని మేపాలని బుద్ధి పుట్టింది.

"బసవన్నా .... లేవగానే నీ మొహమే చూసుకున్నావులా వుందే ఈవేళ!" దాని ముఖం నిమురుతూ అప్పుడే కొన్న అరటిపళ్ళ అత్తం అందించాను. అది ఆ బహుమానం తన జన్మహక్కన్నట్లు తాపీగా, నిర్వికారంగా స్వీకరించింది.

ఈలవేస్తూ గదితాళం తీసి లోపలికి వెళ్ళాను. స్విచ్ కోసం తడుముతుంటే అనుమానం వచ్చింది.! రేపు వసుంధరని కలుసుకోవాలంటే వాళ్ల ఇంటికి వెళ్లొచ్చా?"

వసుంధర తాతగారు "ఎవడీ అంట్ల వెధవ?" అని అడిగితే! నేను వసుంధర క్లాస్‌మేట్‌ని అయినా కాను ...

విసుగెత్తి ఆలోచన దారి మళ్ళించాను.

నాన్న పరీక్షల ముందు ఆఖరిసారి డబ్బు పంపాడు. ఆ డబ్బు అయిపోయింది. సేవింగ్స్‌బాంక్‌లో ఓ నలభై రూపాయలవరకూ వుంది. మహా అయితే ఓ నెల గడుస్తుంది

దాంతో. ఆ తర్వాత?

నాకు ఆ దరిదాపుల్లో ఉద్యోగం ఏం దొరకదని నాకు పూర్తిగా తెలుసు. ఈ ప్రైవేటు పిల్లలన్నా పెద్ద క్లాసుల వాళ్లు కారు. వీళ్లిచ్చేది చిల్లర ...

ఇంటికి వెళ్ళిపోతే ...?

అక్కడన్నీ కరెన్సీనోట్లే-

కాని, నా ఆత్మాభిమానం ఆ కరెన్సీ నోట్లలో కాలి బూడిదౌతుంది.

తల బద్దలు చేసుకున్నా ఏందారి కనబడటం లేదు.

ఇదీ పరిస్థితి.

తిరిగి ఆలోచన వసుంధర వేపు మళ్ళించాను. వసుంధరతో గడిపినదంతా తియ్యని కలగా తోచింది. కమ్మగా నిద్ర పట్టేసింది.

కళ్ళు తెరిచేటప్పటికి ముఖంమీద ఎండ పడుతోంది ఇంటికప్పులోంచి. ఎక్కడో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

బద్ధకంగా లేచి అద్దంలోకి చూస్తూ జుట్టు సవరించుకున్నాను; కిటికీ ఎదుట నిలబడి. పేవుమెంట్ మండిపోతోంది. అయినా ఆంబోతు నిన్నటి చోటనే పరుండి వుంది. కళ్ళు మూసుకుని గతాన్నో, గడ్డినో నెమరువేస్తోంది.

రోడ్డుమీద మెరుపు మెరిసింది. ఇంటివారి గడియారం గంటలు కొట్టడం మొదలుపెట్టింది. ఇప్పుడున్న అవతారంలో కనపడ్డమా, మానడమా అనుకుంటున్నాను. ఇంతలో 'హలో! గుడ్ మార్నింగ్' అంటూ ఆమె వచ్చేసింది.

గడియారం గంటవిని తొమ్మిదా?పదా? అని అడిగింది.

"తొమ్మిది" అప్పుడే ఎక్కడికి బయల్దేరారు?"

"అప్పుడే ఏమిటి? ఒహోహోహో! మీకిప్పుడేనా తెల్లవారింది! అవున్లెండి. అబ్బే ఏం లేదు. శ్యామలాలో మార్నింగ్‌షో మంచిది వుందిట."

"తొమ్మిదీ ముప్పావుకిగా; షో మొదలు? ఇప్పట్నించి ఎందుకూ?"

"అయితే మరీ మంచిది. ఇక్కడే కూచుంటా."

నేను చాలా ఇబ్బందిలో పడ్డాను. పై పడక చూస్తే అది ఎవరూ మనుషుల కుద్దేశించిందనుకోరు. కుర్చీనిండా పుస్తకాలున్నాయి. టేబిల్ మీద న్యూస్ పేపర్లు, తలనూనె. ఆపక్కని నేను సంవత్సరం క్రితమే విసిరేద్దామనుకున్న చెప్పులజత, ఇంటివాళ్ళబ్బాయి ఓసారి సైకిల్ తుడిచిన గుడ్డముక్క- ఇంకా ఎన్నో వింత వస్తువులు ఇరుక్కుని కూచున్నాయి. ఇవన్నీ చూసి సన్నగా నవ్వుతోంది వసుంధర.

"కూచోండి" అన్నాను నేను.

ఎక్కడ కూచోమని.

"కూర్చుంటాలెండి, ఏదయినా పుస్తకం వెతుక్కుని" అంది. తరువాత దృశ్యం చూడకపోడమే మంచిదని నేను బావికి దారి తీశాను. పెరట్లోకి పోయి కిటికీలోంచి తొంగి

చూశాను. పెళ్ళికూతురిలా ముస్తాబై వచ్చింది పాపం! నాబట్టలపెట్టెమీద న్యూస్‌పేపరు పరిచి కూర్చుంది. నిట్టూర్చి నూతి దగ్గరికి పోయాను.

నేను తడితల తుడుచుకుంటూ వచ్చి నిశ్చేష్టుడినై పోయాను గదిని చూసి.

గదిలోని వస్తువుల్లో విప్లవం వచ్చింది. ధర్మబుద్ధి వెల్లివిరిసింది. అంతవరకూ కూర్చుని దురాక్రమణ చేసిన పుస్తకాలు ఉచితస్థానం చేరుకున్నాయి. ఏడాది క్రితం విసిరేద్దామనుకున్న చెప్పులు "గిలటైన్"కు పంపబడ్డాయి. గది భూగోళమే మారిపోయింది. 'ఆమె శ్రమపడిందే' అని కొద్దిగా సిగ్గుకలిగింది.

"వసుంధరాదేవిగారూ! మీకు మీ అద్భుతపనికి హృదయపూర్వక థాంక్స్!

"అదేం భాషండీ! అదేం భాషండీ!" వసుంధర ఉప్పెనగా నవ్వుతోంది.

నాక్కూడా నవ్వొచ్చింది. హఠాత్తుగా వసుంధర వడిలో వున్న ఓ పుస్తకం కిందపడ్డం చూసి కలవరపడ్డాను. అది నేను కథలు వ్రాసే పుస్తకం. నా రహస్యం బైటపడింది. "ఇంకా ఆమె సరిగ్గా చూడలేదేమో, వెళ్ళి ఆ పుస్తకం లాక్కుంటేనో!"

మర్యాదగా అడుగుదామను కున్నాను. గుటకలు మింగాను.

"అమ్మాయిగారూ! మీరు నా రహస్యాన్ని దోచేస్తున్నారు. అన్యాయం"

"అబ్బాయిగారూ! మీరు నిజాన్ని దాచేస్తున్నారు. అనవసరం" వెక్కిరింపుగా సాగదీసు కుంటూ సమాధానమిచ్చింది. తరువాత సీరియస్‌గా 'మీరహస్యాలు మీదగ్గరే ఉంచుకోండి. స్నేహితుల మధ్య రహస్యాలు వుండటం-వుంటాయనుకోలేదు నేను' అని ఆ పుస్తకం నాకిచ్చే సింది.

ముచ్చటగా మూతి ముడుచుకుని కూర్చుంది. నాకు కొద్దిగా బాధ కలిగింది. ఆమె 'ఈవిషయాన్ని అంత సీరియస్‌గా తీసుకుంటుంది' అని అనుకోలేదు. నేను మాత్రం ఆమెకు నా పెన్‌నేమ్ తెలిస్తే నాకు ఉరిపడుతుందేమో అన్నట్లు ప్రవర్తించాను.

పెన్ నేమ్ బయటపడితే ఉరితీయరు కాని ఊపిరి సలపనీరు.

"ఈ మధ్య మీకథ ఒకటి చూశానండి. ఓడ్ హౌస్ ధోరణిలో రాశారు. చచ్చాం నవ్వలేక." ఓడ్ హౌస్ ధోరణట! అది ఎంత నిజమో నాకు తెలుసు. నేను సిగ్గుపడి ముక్కునించి చెవుల వరకూ కందిపోతాను. ఎంత తీయగా వున్నా అది అబద్ధమేగా! ఏదో చచ్చు సమాధానం కుంటు కుంటూ వస్తుంది నా నోట్లోంచి.

"కానీ మీకథలో .... కథేం కనపడదే! హాస్య ప్రధానమైన రచనల్లో అది సామాన్యంగా జరుగుతూనే వుంటుంది. వాటిల్లో శైలీ, వాక్య చమత్కారం వంటివి తప్ప కథేమిటి అని చూస్తే శూన్యం ఎదురుకావచ్చు."

"అందుచేతనే కాబోలు ఈ మధ్య ప్రతి చెత్తా పత్రికలకి ఎక్కుతోంది. కాఫీ తాగారా- నేను తాగాలి. మరి వెళ్ళొస్తాను."

నేను పగటివేషం ముగించి ఆమె వైపు చూశాను. ఆమె నాకేసి చూస్తున్నదల్లా మొగం .... తిప్పేసుకుంది. మాట్లాడ్డానికి సిద్ధంగా లేదన్నమాట? ఎంతవరకూ సాగుతుందో చూద్దాం

అనుకున్నాను. "సొగసుకత్తెలకి అలకలు కూడా శృంగారమే" అంటాడు కరటక శాస్త్రి!

నేను తాళం కప్ప పట్టుకు వెళ్ళి గది బయట నిలబడ్డాను. తలవంచుకుని విసురుగా గది బయటకు వచ్చింది.

తలవంచుకు నడుస్తూ వాలుగా చూస్తోంది. నేనూ చూడనట్లు నటిస్తూనే చూస్తున్నాను. పేవుమెంటు మీద నడిచేం గనక ప్రమాదాలేం జరగలేదు.

హాలులో కూర్చున్నానన్న మాటేగాని రెస్ట్ లేకుండా పోయింది. ఒకవేళ నిజంగానే కోపం వచ్చిందేమో. ఎలాగా తేల్చుకోడం?

ఇంటర్వెల్ వరకూ తెర మీద దృష్టేలేదు. ఇంటర్వెల్‌లో రెండు డ్రింకులు తీసుకున్నాను. ఒకటి నేను తీసుకుని ఆమె వేపు చూశాను. తీసుకోనన్నట్లు తల అటుతిప్పేసింది. ఆ తెచ్చిన వాడిచ్చిన డ్రింక్ తీసుకుంది. నాకు కొద్దిగా ఉపశాంతి కలిగింది.

పిక్చరుమీద దృష్టి మళ్ళించాను కాని ప్రారంభం తెలియక ఏదో అయోమయంగా వుంది. వసుంధర పిక్చరు చూడ్డం మానేసి నావంకే చూస్తోందని గమనించి నేను తెరమీదే దృష్టి కేంద్రీకరించాను.

లైట్లు వెలిగాయి. హాలు బయటపడ్డాం.

"సర్వస్వం కోల్పోయిన హీరోయిన్ విషం తీసుకుందామని డాక్టరు రూంలోకి వెళ్ళి దొంగతనంగా వెళ్ళి అక్కడ పంచ్ చదువుతూ కూర్చుందేమండి?" వసుంధర వాలుగా చూస్తూ మాట్లాడింది.

బతికాన్రా అని స్వేచ్ఛగా ఊపిరిపీల్చాను. కాని ఆదృశ్యం చూసే భాగ్యం నాక్కలగలేదు. "దేన్ని గురించి మీరనేది?" అన్నాను.

"దేన్ని గురించా! అదిగో ఆమేకని లాక్కుపోతోందేం ... ఆ అప్పలమ్మను గురించి - అప్పలమ్మ అంట్లు తోముదామని బావి దగ్గరకు వెళ్ళి భగవద్గీత ఎందుకు చదివిందీ అని" విసురుగా అంది.

నాకూ కోపం వచ్చింది. నేను మొదటి సగం చూడలేదు నిజమే. తను రెండో సగం చూడలేదుగా. నా తక్కువేమిటి!

'ఓ అదా! హరిశ్చంద్ర నాటకంలో అక్షరాలు రాని అభాగ్యుడు సంస్కృత పదాలు వేసి మత్తకోకిల ఆటువుగా చదవలేదూ? ఎందుకు చదివాడటా?"

"ఎందుకా! సంస్కృతానికి, సంస్కృతికి దగ్గర సంబంధం ఉంది కనుక!" తడుముకోకుండా సమాధానమిచ్చింది వసుంధర.

ఆ జవాబుతో నా శరీరంలో 'భూకంపం' వచ్చింది. నవ్వుతో పేగులు కదిలిపోయాయి. వసుంధరా నవ్వేసింది.

మాకలహం అందంగా అంతమైంది - మా సాన్నిహిత్యం మరింత అయింది, ఆ కలహం మూలంగాను.

మా సమావేశాలు వసుంధర మేడమీదనే జరుగుతూండేవి. ఆ మేడపైన మూడు

గదులూ ఎదురుగా విశాలమైన డాబా ఉన్నాయి. పెరట్లో కొబ్బరి చెట్లు మూడు – పిట్టగోడని తల ఆనించి – డాబా మీదికి చల్లగా చూస్తూంటాయి. అటువంటి ఆమేడ అంతటికీ రాణీ వసుంధర. వసుంధర తాతగారు క్రిందనే వుంటారు.

వసుంధరకి తాతగారిచ్చిన ఓ చిన్న లైబ్రరీ ఉంది. ఓ కారమ్సు బోర్డు, చిన్న చక్కని బాంజో ఇవీ వినోదసాధకాలు. పేకముక్కలపేర్లు కూడా తెలియవు వసుంధరకి.

ఒక ఆదివారం ప్రయివేటుకి శలవు. ఉదయం ఏడుగంటలకే వసుంధర రాజ్యంలో తిష్ఠవేశాను.

"రాజూ! నేను స్నానం చేసి వస్తాను. అంతదాకా ఈ పుస్తకాలు చదువుకో అల్లరిచెయ్యకేం" వసుంధర మెట్లు దిగి మాయమైంది. మేమిద్దరం కలిసి 'అండీ'ని ఎక్కడో దాని ఖర్మానికి వదిలేశాం.

కర్ర చప్పుడు వినిపించింది. వసు తాతగారు. మూడు నెల్లయినా ఆయన కంటపడలేదు నేను. ఈవేళ నాకు ఏదో మూడిందనుకున్నాను. నేను అక్కడికి ఏ హోదాలో వచ్చిందీ చెప్పమంటే .... నేను వసుంధర క్లాస్‌మేట్ నయినా కాను. ఆయన కర్రపై కెత్తి 'ఒన్ ...టూ ...త్రీ.' అంటే ...మొండిగా తలవంచుకున్నాను పుస్తకం మీదికి.

గదిలోకి నీడపడింది. లేచి నిలపడ్డాను. ఆయన చిఱునవ్వుతో 'కూర్చో నాయనా, కూర్చో!' అన్నారు.

ఆయన పడక్కుర్చీలో కూర్చుని ఓ నిమిషం కళ్ళు మూసుకు తెరిచి "నీతో మాట్లాడ దామని ఎన్నాళ్ళనించో అనుకుంటున్నాను. నీగురించి కొంత తెలిసిందిలే." ఊపిరి బిగపెట్టి వింటున్నాను. "నీకథలు కూడా చూశాను."

"అవును కాని ... మావసుంధర నిన్ను ఒక్కరోజు చూడకపోతే ఉండలేదోయ్. పిచ్చితల్లి. కాపరానికి వెళ్తే ఎలాగో? అక్కడ ఎలాగో సరిపెట్టుకుంటుందిలే." ఉలిక్కిపడ్డాను. కాపరం ఏమిటీ! ఆయన గ్రహించాడు.

"వసుంధరకి పెళ్ళయింది బాబూ ... తొమ్మిదో ఏట అయింది" ఆయన కథంతా వివరించి చెప్పాడు.

బొమ్మల పెళ్ళిళ్ళ రోజుల్లో తినేవి మాత్రమే తియ్యగా ఉంటాయనుకునే తొమ్మిదేళ్ళ వయసులో – వసుంధరకి పెళ్ళయింది. ఆమె మొగుడు అప్పుడు ఇంజనీరింగు చదువుతున్నాడు.

"అతని కిప్పుడు క్షయవ్యాధి–రెండేళ్ళనించీ శానిటోరియంలో ఉంటున్నాడు. అదేం వ్యాధో కాని అంతూదరీ కనపడటం లేదు ... " వసుని చూసి ఆయన ఆగిపోయాడు ... గది విడిచి సాగిపోయాడు.

వెన్నెల వెలుగులో సాలెగూడు కూడా ఎంతో మనోహరంగా వుంటుంది.

వసుంధర వచ్చి నాజీవితంలోనే వెన్నెల పరిచింది. వెన్నెట్లో సాలెగూళ్ళూ అందంగా ఉంటాయి... లేకపోతే నాన్న మాట వింటే ఒచ్చే ఆ కట్నం, ఆస్థిలో నాకొచ్చే వాటా బెజవాడ లో మేడా ఒదులుకుని ఈ ఊళ్ళో మొద్దబ్బాయిలకు అక్షరాలు రాసిస్తూ వసుంధర అనే ఈ

"కల" నిజమే అని ఆనందించగలిగే వాణ్ణా!

కాని, ఈవేళే తెలిసింది; కల త్వరలోనే కరిగిపోక తప్పదని. వసుంధర భర్తకి జబ్బు తగ్గితే కాపరానికి తీసుకుపోతాడు. నేను యావజ్జీవం బాధపడితే వసుంధర మరి ఎలా జీవిస్తుంది? ఏమైనా వసుంధరా-నేను చెరోదారీ చూసుకోవల్సిందే.

"తాతయ్య ఏమంటాడు రాజూ!" అంది వసుంధర తడి జుట్టు ఆరబెడుతూ. బల వంతంగా నవ్వి "నా కథలలో శిల్పం బాగులేదన్నారు. కావ్యాలూ, గ్రంధాలు చదవమని సలహా యిచ్చారు" అన్నాను.

"తాతయ్య అంతేలే. చాలా మంచి తాతయ్య కదూ రాజూ. మంచివాడు కాకపోతే నన్నిలా తిరగనిచ్చేవాడా?"

ఆ పూట నేను భోజనం చెయ్యలేదు. వసుంధర జీవించటం లేదు ... బయటకు అంత సంతోషంగా ఎలా కనిపిస్తోంది? వసుంధర నాతో మామూలుగానే మాట్లాడుతోంది. ఆమె అలా వుండగా లేంది నాకింత గుండె బరువెందుకూ?

* * *

ఒకరోజున వసుంధర తాతగారు ఏదోపనిమీద కాకినాడ వెళ్ళారు. సాయంగా వాళ్ళ ఇంట్లో ఉండమన్నారు-

పౌర్ణమి. వసుంధర మంచం మీద పడుకుని చంద్రుణ్ణి చూస్తోంది. నేను పడక్కుర్చీలో పడుకుని ఎంకిపాటలు చదువుతున్నాను. ఈరేయి నన్నొల్లనేరవా రాజా ... ఎన్నెలల సొగసంతా ఏటిపాలేనటర!" పాట చదివి పుస్తకాన్ని కళ్ళ కద్దుకున్నాను. చదువుతుంటే నిద్రపట్టేసింది నాకు తెలియకుండానే.

వసుంధర భర్త రోగం అలాగే వుండిపోయింది. వసుంధర మంగళసూత్రం మీద కన్నీరభిషేకిస్తూ గడిపింది ఎన్నేళ్ళో. ఓ మారు నన్ను చూసి కన్నీటి కళ్ళకి వెన్నెలేం కనబడుతుంది. "నా బతుకింతే రాజూ. నువ్వుకూడా ఎందుకు నాచీకటి పంచుకుంటావు పోయి పెళ్ళి చేసుకో" అంది వలవలా ఏడుస్తూను. 'ఛీ! నేను పెళ్ళి చేసుకుంటానా, నీవా స్థితిలో ఉండటం చూసి' అన్నాను. ఊరెళ్లిన తాతగారు రానేలేదు.

నేను పిచ్చెత్తినట్టు జీవిస్తున్నాను. బడిపంతులుగా పిచ్చమేస్టారు అని పేరునాకు. నేను ఉద్యోగం చేసి కళ్ళకు చత్వారం జోడు, జుత్తుకి వెండిరంగు ... నోటికి పెట్టుడు పళ్ళూ సంపాదించాను. నాకు మతి నిలకడపోయింది. కాని పిచ్చాసుపత్రికి మాత్రం దూరంగా వుంటూ వచ్చాను.

ఓ రోజున తెల్లటి జుట్టు విరబోసుకుని వసుంధర నాదగ్గరకు వచ్చి "పెళ్ళాడిన కన్యని రాజూ! పెద్దదాన్నై పోయాను. నువ్వు పెళ్ళి చేసుకోలేదా! అయ్యో ... నాశని నీక్కూడా పట్టిందా రాజూ" అని ఏడుస్తూ వెళ్ళిపోయింది. తలగోడకేసి కొట్టుకుంటున్నాను. నలుగురూ వచ్చి ఆపారు. పిచ్చిగా వాగుతున్నాను. "నన్ను చావనివ్వండి. నాహృదయం చచ్చిపోయింది. నా ఆత్మ చచ్చిపోయింది. నేను శాశ్వతంగా ఉంటానా?"

వసుంధర వెళ్ళిపోయింది..." బంగారుతల్లి ...తొమ్మిదో ఏట పెళ్ళి చేసుకుంది. భర్త ఇంజనీరు. ఆమెకేం కొదవలేదు. కావలసినంత ఐశ్వర్యం. కానీ ఒక్కరోజైనా కాపరం చెయ్యలేదు!" అంటున్నారు జనం, ఆమె వెళ్తూంటే.

ఆ గుంపులో ఎవరో చెప్పేరు: వసుంధర భర్త చనిపోయాడు. వసుంధర కప్పుడు అరవై ఏళ్ళు.

* * *

నేను ఏడుస్తూ మేల్కొన్నాను. గాభరాగా చుట్టూ చూశాను వసుంధరకోసం. వసుంధర కనిపించలేదు. మంచంమీద ఉండాలే. ఏమైంది! నాకాళ్ళు లబలబ లాడుతున్నాయి. మనస్సు అనేక విధాల పోయి ముచ్చెమటలూ పోశాయి. దారుణమైన కల ...తిరిగి జ్ఞాపకం వచ్చి నిలువెల్లా కంపించిపోయాను. వసుంధర ఏమైంది!

అతికష్టం మీద మేడమెట్ల వరకూ నడిచాను. అక్కడ కూలబడ్డాను. ఎక్కడో పదకొండు గంటలు కొట్టారు. చెట్లు తలలాడిస్తున్నాయి.

వసుంధర మెట్లెక్కుతోంది తడబడుతూ అంది. "ఆయన పోయారుట రాజూ. టెలిగ్రాం వచ్చింది మనం వెంటనే బయల్దేరాలి." నాకలలో కనిపించిన దుఃఖం నాదేగాని వసుంధరది కాదు.

గదికి తాళం వేసేదాకా మరేం మాట్లాడలేదు వసుంధర. ఆఖరి మెట్టు దిగి రోడ్డుమీద అడుగుపెట్టేక నన్ను ఆపింది. "తాతయ్యకి చెప్పలేదు. అక్కడికెళ్లి వచ్చేక చెబ్దాం" అంది.

* * *

నాన్న ఎంత తాపత్రయ పడితే మటుకు-వసుంధరలాంటి అమ్మాయిని తేగలుగుతాడా?

**(ఆంధ్రపత్రిక; వీక్లీ – 13-6-1956)**

★